నమస్తే తెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
5 | ఖమ్మం, సోమవారం 9 జూన్ 2025 | BHADRADRI KOTHAGUDEM

కనిగిరి గుట్టల్లో భద్రాద్రి ఎస్పీ..

గుట్టల అందాలు, ప్రకృతి రమణీయత పట్ల పరవశం

చంద్రుగొండ, జూన్ 8: మండలంలోని బెండాలపాడు గ్రామ శివారులో ఉన్న కనిగిరి (కనకాద్రి) గుట్టల అటవీ ప్రాంతాన్ని భద్రాద్రి ఎస్పీ రోహిత్‌రాజు ఆదివారం పరిశీలించారు. తొలుత బెండాలపాడులోని బ్యాంబూ క్లస్టర్ (వెదురు ఉత్పత్తుల తయారీ కేంద్రాన్ని) సందర్శించి ఉత్పత్తుల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం కనకాద్రి గుట్టలు ఎక్కారు. వాటి అందాలను, అక్కడి నుంచి కన్పించే అటవీ ప్రాంత రమణీయతను చూసి పరవశించిపోయారు. కనిగిరి గుట్టలను మంచి పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందేందుకు అవకాశాలు పుష్కలంగా ఉన్నాయంటూ కితాబిచ్చారు. కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్, సీఐలు రాయల వెంకటేశ్వర్లు, ఇంద్రసేనారెడ్డి, ఎస్సైలు, చంద్రుగొండ అటవీశాఖ రేంజర్ ఎల్లయ్య, ఫారెస్టు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కనిగిరి గుట్టల అందాలను వ్యూ పాయింట్ నుంచి వీక్షిస్తున్న ఎస్పీ రోహిత్‌రాజు, పోలీసులు, ఫారెస్ట్ సిబ్బంది

హైదరాబాద్ మాదాపూర్‌లో బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ నివాసంలో ఆయన పార్థివదేహంపై పూలు చల్లి అంజలి ఘటిస్తున్న రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర; గోపీనాథ్ పార్థివదేహంపై పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య

మాగంటి గోపీనాథ్ అకాల మరణం..

పార్టీకి తీరని లోటు

- బీఆర్ఎస్ జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మృతిపై జిల్లా నేతల విచారం
- వద్దిరాజు, అజయ్, నామా, సండ్ర నివాళి.. రేగా, మెచ్చా సంతాపం..

ఖమ్మం/ సత్తుపల్లి/ మణుగూరు టౌన్/ దమ్మపేట, జూన్ 8: బీఆర్ఎస్ జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అకాల మరణం.. పార్టీకి తీరని లోటంటూ ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన ఆ పార్టీ నేతలు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు విచారం వ్యక్తం చేశారు. గుండెపోటుతోపాటు తీవ్ర అస్వస్థతకు గురై నాలుగు రోజులుగా హైదరాబాద్ ఏఐజీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గోపీనాథ్.. ఆదివారం ఉదయం ప్రాణాలు విడిచారన్న వార్త తెలుసుకున్న జిల్లా నేతలు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ మేరకు పలువురు నేతలు హైదరాబాద్ మాదాపూర్‌లోని గోపీనాథ్ నివాసంలో ఆయన పార్థివదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. మరికొందరు నేతలు వేర్వేరు ప్రకటనల్లో సంతాపం వ్యక్తం చేశారు. రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఖమ్మం మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు, సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య తదితరులు ఆదివారం హైదరాబాద్ వెళ్లి గోపీనాథ్ భౌతికకాయాన్ని సందర్శించి అంతిమ యాత్రలో పాల్గొన్నారు. రఘునాథపాలెం మండలం ఈర్లపూడిలో ఆదివారం జరుగనున్న వైరా మాజీ ఎమ్మెల్యే మదన్‌లాల్ దశదిన కర్మల కార్యక్రమానికి బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ రావాల్సి ఉంది. ఉదయం మాగంటి గోపీనాథ్ మృతిచెందడంతో కేటీఆర్ ఖమ్మం పర్యటన రద్దయింది. కాగా, హైదరాబాద్‌లో గోపీనాథ్‌కు నివాళులర్పించిన జిల్లా నేతలు.. మాగంటి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. గోపీనాథ్ పవిత్రాత్మకు శాంతి చేకూర్చాలని భగవంతుడిని ప్రార్థించారు. అలాగే, బీఆర్ఎస్ ఖమ్మం, భద్రాద్రి జిల్లాల అధ్యక్షులు తాతా మధు, రేగా కాంతారావు, అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు, భద్రాద్రి జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు దిండిగాల రాజేందర్, రైతుబంధు సమితి భద్రాద్రి జిల్లా మాజీ అధ్యక్షుడు రావు జోగేశ్వరరావు తదితరులు వేర్వేరు ప్రకటనల్లో సంతాపం తెలిపారు.

రాష్ట్రంలో నిరుపేదలకు సొంతింటి కలను నెరవేర్చేందుకు మా ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల పథకం ప్రవేశపెట్టింది. ఖమ్మం జిల్లాలో 9,326 మంది లబ్ధిదారులకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేసింది. ఇంటి నిర్మాణ పురోగతిని అనుసరించి నాలుగు దశల్లో గ్రీన్ చానల్ ద్వారా లబ్ధిదారులకు నేరుగా రూ.5 లక్షలను జమ చేస్తుంది.

-ఖమ్మంలో ఇటీవలి రాష్ట్ర అవతరణ వేడుకల్లో డిప్యూటీ సీఎం భట్టి

రాజకీయాలకు అతీతంగా నిరుపేదలకు మొదటి విడతలో ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తున్నాం. ప్రభుత్వం ఖర్చు పెట్టే ప్రతి రూపాయీ పేదలకు ఉపయోగపడాలని మా ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. రాష్ట్రంలో 20 లక్షల ఇండ్ల నిర్మాణమే లక్ష్యంగా మా ప్రభుత్వం పనిచేస్తోంది. ఎక్కడా లంచాలకు ఆస్కారం లేకుండా ప్రతి నియోజకవర్గానికీ 3,500 ఇండ్లు మంజూరు చేస్తున్నాం

-ఇటీవల ఇండ్ల మంజూరు పత్రాల పంపిణీలో రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

అర్హత కలిగిన ప్రతి నిరుపేదకూ ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందాలి. ఎక్కడా రాజకీయ పరమైన వివక్ష ఉండొద్దు. ముఖ్యంగా ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక విషయంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇండ్లు మంజూరు చేయాలి. ఎలాంటి తేడాలూ రావద్దు.

-ఇటీవలి అధికారుల సమీక్షలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఇలా.. ఇందిరమ్మ ఇండ్ల మంజూరులో రాజకీయాలకు తావుండదని, అర్హులైన నిరుపేదలకే ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని ఇలా అధికారిక సభలు, సమావేశాల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన అమాత్యులు ప్రసంగాలు వినిపించారు. కానీ క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితి ఇందుకు పూర్తి భిన్నంగా ఉండడం గమనార్హం. తొలుత కొన్ని పైలట్ గ్రామాల్లో రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటించి రాజకీయాలకు అతీతంగా నిరుపేదలను ఎంపిక చేసినప్పటికీ.. మిగిలిన పైలట్ గ్రామాల్లోనూ అనేకమంది నిరుపేదల ఆందోళనలు చేసిన ఘటనలున్నాయి. తరువాత అన్ని గ్రామాల్లోనూ మొదలైన అర్హుల గుర్తింపు ప్రక్రియలో ఇందిరమ్మ కమిటీలే కీలకంగా ఉండి లబ్ధిదారుల ఎంపిక చేయడం గమనార్హం.

ఇండ్ల మంజూరులో.. రాజకీయం

- లబ్ధిదారుల ఎంపికలో ఇందిరమ్మ కమిటీలదే అంతిమ నిర్ణయం
- పైకి మాత్రం.. రాజకీయాల్లేకుండా ఎంపికలుండాలంటూ పలుకులు
- పేదల సొంతింటి కల నెరవేర్చితీరుతామంటూ సభల్లో ప్రసంగాలు
- కానీ క్షేత్రస్థాయిలో అడుగడుగునా అధికార పార్టీ శ్రేణులకే ఇండ్లు
- ఇప్పటికే అనేకచోట్ల నిలదీతలు.. ప్రభుత్వంపై ఆగ్రహిస్తున్న నిరుపేదలు
- గత గ్రామసభల నుంచి ఇప్పటిదాకా అన్ని గ్రామాల్లోనూ ఆందోళనలే..
- పైగా, సవాలక్ష నిబంధనలు.. పొరపాటున అతిక్రమిస్తే అర్హత తొలగింపు..
- మధిర నియోజకవర్గంలో లబ్ధిదారుల ఎంపికను నిలిపివేసిన 'భట్టి'?

అన్నపురెడ్డిపల్లి మండలం ఊటుపల్లి పంచాయతీ జానకీపురంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇల్లు

ఖమ్మం, జూన్ 8: ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికీ 3,500 ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తున్నామని ప్రకటించిన కాంగ్రెస్ ప్రభుత్వం.. ఖమ్మం జిల్లాలోనూ ఆ మేరకు ఇండ్లు మంజూరు చేసింది. తొలుత మండలానికి ఒకటి చొప్పున పైలట్ గ్రామాన్ని ఎంపిక చేసింది. ఆ గ్రామాల్లో మాత్రమే కొంత మేరకు నిజమైన పేదలకు మంజూరు పత్రాలు పంపిణీ చేసింది. మొదట గ్రామసభల్లో మంజూరు పత్రాలు అందించి.. తీరా ఇల్లు కూల్చుకొని ముగ్గుపోసుకున్నాక జాబితాలో పేరులేదంటూ ఎగనామం పెట్టిన ఘటనలూ ఖమ్మం రూరల్ వంటి మండలాల్లో వెలుగు చూసిన విషయం విదితమే. ఇక, తొలుత మొదలైన పైలట్ గ్రామాల్లో కొంత వరకూ నిరుపేదలను ఇందిరమ్మ ఇళ్లకు ఎంపిక చేసినప్పటికీ.. తరువాత అన్ని గ్రామాల్లో ప్రారంభించిన అర్హుల ఎంపికలో మాత్రం పూర్తిగా రాజకీయ శక్తులు ప్రవేశించాయి. ఇందిరమ్మ ఇండ్లకు అర్హుల ఎంపిక బాధ్యతను సాక్షాత్తూ ప్రభుత్వమే అప్పగించడం, ఆ కమిటీ నిండా అధికార పార్టీ నాయకులు, కార్యకర్తలే ఉండడం, కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన వారినే ఆ కమిటీ ఇందిరమ్మ ఇండ్లకు ఎంపిక చేయడం, ఎంపికల్లో ఇందిరమ్మ కమిటీలదే అంతిమ నిర్ణయం కావడం, దీనిపై అనేక గ్రామాల్లో ప్రజాప్రతినిధులను పేదలు నిలదీయడం, కొన్ని గ్రామాల్లో అధికారుల సర్వేనూ అడ్డుకోవడం వంటి ఘటనలు జిల్లాలో చోటుచేసుకోవడం గమనార్హం. అయినప్పటికీ అమాత్యులు మాత్రం అన్ని సభల్లోనూ 'రాజకీయాలకు అతీతంగా ఇందిరమ్మ ఇండ్లు ఇస్తున్నాం' అనే మాటలు పలుకుతుండడంతో నిరుపేదల విస్మయం వ్యక్తం చేస్తుండడం విశేషం.

మెడ మీద కత్తిలా నిబంధనలు..

ఇక అక్కడో ఇక్కడో ఎంపికైన నిరుపేదలు కూడా తమ సౌకర్యాలను అనుగుణంగా ఇల్లు నిర్మించుకునే వెలుసుబాటు లేకుండా కాంగ్రెస్ ప్రభుత్వం అనేక కఠినమైన నిబంధనలు తెచ్చింది. దీంతో ఇంటి నిర్మాణంలో ఏ మాత్రం పొరపాటు జరిగినా, తమకు అనువుగా ఏ కాస్త నిర్మాణాన్ని మార్చినా అర్హత కోల్పోవడంతో పాటు నిర్మించుకున్న ఇంటికి బిల్లును కూడా నిలిపివేసే నిబంధనలను లబ్ధిదారుల మెడపై కత్తిలా వేలాడదీస్తోంది. తాము చెప్పిన చోట కాకుండా బాత్‌రూమ్‌ను మరోచోట నిర్మించినా, గదుల వైశాల్యాలను ఏ మాత్రం పెంచినా తగ్గించినా, స్లాబ్ విస్తీర్ణంలో మార్పులు జరిగినా అనర్హత వేటు వేయనున్నట్లు ఆ నిబంధనల్లో స్పష్టం చేశారు. తెలంగాణ హౌసింగ్ కార్పొరేషన్ తీసుకొచ్చిన యాప్‌లో.. ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి ముగ్గ పోసినప్పటి నుంచి మొదలుకొని నిర్మాణం పూర్తయ్యే వరకూ ఎప్పటి దశను అప్పుడే ఫొటో తీసి అప్‌లోడ్ చేసేలా రూల్స్ రూపొందించారు. ఆ నిబంధనల ప్రకారం ఆయా దశల్లో ఇంటి నిర్మాణం జరిగేతే బిల్లులు మంజూరవుతాయని, లేదంటే మంజూరు కావని కాంగ్రెస్ ప్రభుత్వం స్పష్టం చేస్తోంది.

నెరవేరుస్తామంటూనే సొంతింటి కలకు తూట్లు..

నిరుపేదల సొంతింటి కలను నెరవేరుస్తామంటూ సభల్లో ఊకదంపుడు ఉపన్యాసాలు చేస్తున్నప్పటికీ.. షరతులు, నిబంధనల పేరిట అసలైన పేదల సొంతింటి కలకు కాంగ్రెస్ ప్రభుత్వం తూట్లు పొడుస్తున్నట్లుగానే ఉంది. ప్రభుత్వం ఇస్తామంటున్న రూ.5 లక్షలతో ఉండడానికి గూడు కట్టుకుందామనుకున్న పేదల ఆశలు అడియాశలవుతున్నాయి. ముఖ్యంగా ఇందిరమ్మ కమిటీల ప్రమేయం గణనీయంగా ఉండడం, అధికార పార్టీకి చెందిన వారికే ఇండ్ల మంజూరులో అగ్రతాంబూలం వేయడం, కొన్ని వెసులుబాట్లు కూడా లేకుండా కఠిన నిబంధనలు విధించడం వంటివి ఇందిరమ్మ ఇండ్లకు నిరుపేదలను దూరం చేస్తున్నాయి. అయితే, తొలుత ఎంపికైన లబ్ధిదారుల్లో కొందరు తమ అవసరాలకు అనువుగా ఇండ్ల నిర్మాణాన్ని చేపట్టారు. అలా చేస్తే బిల్లులు రావంటూ ప్రభుత్వం స్పష్టం చేయడంతో వారంతా ఇప్పుడు ఆ నిర్మాణాలను పునరుద్ధరించుకుంటున్నారు. అయితే, మధిర నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపికను ఆ నియోజకవర్గ ఎమ్మెల్యే అయిన డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క నిలిపివేసినట్లు తెలిసింది.

తిరుమలాయపాలెం: అర్హులకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయలేదంటూ బచ్చోడు జీపీ ఎదుట ధర్నా చేస్తున్న గ్రామస్తులు (ఫైల్)

చండ్రుగొండ: ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామంటూ లబ్ధిదారుల నుంచి కాంగ్రెస్ నాయకులు రూ.50 వేల చొప్పున వసూలు చేస్తున్నారంటూ గుర్రంగూడెంలో రాస్తారోకో చేస్తున్న గ్రామస్తులు (ఫైల్)

ఈదురుగాలుల వర్షం

- భద్రాద్రి జిల్లాలో ప్రధాన రోడ్లపై కూలిన చెట్లు

జూలూరుపాడు, జూన్ 8: జూలూరుపాడు మండలంలో ఆదివారం ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం బీభత్సం సృష్టించింది. రెండు గంటలపాటు కురిసిన భారీ వర్షంతో రోడ్లపై వర్షపు ప్రవహించింది. సబ్ మార్కెట్‌యార్డ్ సమీపంలో ప్రధాన రహదారి పక్కన ఉన్న రెండు భారీ వృక్షాలు రోడ్డుపై కూలాయి. గంటపాటు వాహనాలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న పోలీసులు డోజర్ సహాయంతో వర్షంలోనే చెట్టును తొలగించి ట్రాఫిక్ క్లియర్ చేసి వాహన రాకపోకలను పునరుద్ధరించారు. పాపకొల్లు కూడలిలో వేపచెట్టు విరిగి పడింది. బోజ్యాతండాలో ఇంటిపై ఉన్న రేకులు ఎగిరిపోయాయి.

జూలూరుపాడు: కొత్తగూడెం - ఖమ్మం రహదారిపై విరిగి పడిన చెట్లు

టేకులపల్లిలో..

టేకులపల్లి, జూన్ 8: మండలంలోని సులానగర్, ముత్యాలంపాడు క్రాస్‌రోడ్డు గ్రామాల్లో ఇంటిపై రేకులు లేచిపోయాయి. సులానగర్‌లో బానోత్ బుజ్జి రేకులఇంటి పైరేకులు గాలికి ఎగిరిపోవడంతో రోదిస్తున్నది. సులానగర్, ముత్యాలంపాడు క్రాస్‌రోడ్డు మధ్యలో ఇల్లెందు, కొత్తగూడెం ప్రధాన రహదారిపై చెట్టు విరిగిపడడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ముత్యాలంపాడు క్రాస్‌రోడ్డు గ్రామంలో విద్యుత్ స్తంభాలు విరిగి విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది.

టేకులపల్లి: ఎగిరిపోయిన రేకులను చూపిస్తూ రోదిస్తున్న వృద్ధురాలు

జూలూరుపాడు: కొత్తగూడెం - ఖమ్మం రహదారిపై చెట్టు విరిగి పడడంతో భారీగా నిలిచిన వాహనాలు

టేకులపల్లి: ఇల్లెందు - కొత్తగూడెం రహదారిపై విరిగి పడిన చెట్టు పక్క నుంచి రాకపోకలు సాగిస్తున్న వాహనాలు